https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్  ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01  సంచిక : 355  సోమవారం 6-4-2026  పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# 100 ఎకరాల్లో..
# వందేళ్ల భవిష్యత్తు!

### తెలంగాణ హైకోర్టు దేశంలోనే అత్యుత్తమం కానుంది

### 2027 డిసెంబరు కల్లా నిర్మాణాలన్నీ పూర్తి: రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 5**

"అందరికీ న్యాయం అనే లక్ష్యంతో ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఏర్పాటు చేయాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. కానీ, ఆ లక్ష్యం సాకారం కావాలంటే సరైన మౌలిక వసతులు అవసరం. తెలంగాణలో ఆ లక్ష్యం క్రమంగా ఆచరణలోకి వస్తోంది" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. రాజేంద్రనగర్‌లో 60 ఎకరాల్లో నిర్మించనున్న హైకోర్టు జోన్-2 భవనాలకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'నా న్యాయ సేవా జీవితంలో ఓ విషయం గమనించాను. ప్రతి కార్యక్రమం మూడు దశల్లో ముందుకు సాగుతుంది. ప్రారంభం లక్ష్యాన్ని తెలియజేస్తుంది. మధ్యస్థ దశ పట్టుదలను చూపిస్తుంది. చివరికి ఫలితం ఆ వాగ్దానం నెరవేరిందా? అనే విషయాన్ని నిర్ధారిస్తుంది. ప్రస్తుతం మనం అలాంటి కీలకమైన దశలో ఉన్నాం. జోన్-1 నిర్మాణం కొనసాగుతుండగా, జోన్-2కు శంకుస్థాపన చేస్తున్నాం. ప్రజలకు కోర్టు అంటే బెంచ్, జాతీయ చిహ్నం, విచారణలు మాత్రమే కనిపిస్తాయి. కానీ, ఆ కోర్టును నడిపించే ఒక పెద్ద వ్యవస్థ వెనక ఉంటుంది.

జడ్జిలు నివసించే భవనాలు, శిక్షణ కేంద్రాలు, పాత తీర్పులను భద్రపరచడం ఎంతో కీలకమైన అంశాలు. అలాంటి నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నాం.'



**ఇది రాజ్యాంగబద్ధమైన బాధ్యత..**

ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు. రాజ్యాంగబద్ధమైన బాధ్యత. అందరికీ న్యాయం అనే లక్ష్యంతో ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఏర్పాటు చేయాలని రాజ్యాం గ నిర్మాతలు భావించారు. తెలంగాణలో ఆ లక్ష్యం క్రమంగా ఆచరణలోకి వస్తోంది. 40ఎకరాల్లో జోన్-1 పనులు వేగంగా సాగుతున్నాయి. అదే సమయంలో జోన్-2 కూడా ప్రారంభమవుతోంది. ఇది చాలా సరై న నిర్ణయం. ఎందుకంటే ప్రస్తుత హైకోర్టు భవనం అవసరాలకు సరిపోవడం లేదు. రాబోయే 100 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్మాణం చేపట్టాలి. పెద్ద చెట్టు నిలబడడానికి వేర్లు ఎంత ముఖ్య మో, ఈ నిర్మాణమూ అంతే ముఖ్యమైనది. సుమా రు 60 ఎకరాల్లో 57 నిర్మాణాలు చేస్తారు. ఇది దేశంలోనే అత్యుత్తమ హైకోర్టు అవుతుందని, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని విశ్వసిస్తున్నా.

**న్యాయ స్వతంత్రతకు వసతులు కీలకం..**

న్యాయ స్వతంత్రతకు సరైన వసతులు కూడా కీలకం. మొత్తం 100 ఎకరాల క్యాంప్‌సలో అన్ని విభాగాలు ఒకే ప్రాంగణంలో ఉంటాయి. దీంతో న్యా యవ్యవస్థ స్వతంత్రంగా పనిచేయగలదు. జోన్-2లో నిర్మించనున్న ఆడిటోరియం నాకు ప్రత్యేకంగా ప్రియమైనది. ఇక్కడ న్యాయ శిక్షణ కార్యక్రమాలు, సదస్సులు జరుగుతాయి. మూడు అంతస్తుల సెంట్రల్ రికార్డు గది కూడా అత్యంత కీలకం. పాత తీర్పుల ప్రతులు భద్రంగా ఉండడం న్యాయ వ్యవస్థ స్థిరత్వానికి అవసరం.

**సీఎం రేవంత్‌రెడ్డి కృషి అభినందనీయం..**

ఈ ప్రాజెక్ట్ 2009లో ప్రారంభమైంది. అప్పుడు జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత కొత్త క్యాంపస్ అవసరం ఏర్పడింది. 17 ఏళ్ల కృషి తర్వాత ఈ దశకు చేరుకున్నాం. డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రూ.2500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయడం అభినందనీయం. న్యాయవ్యవస్థ, ప్రభుత్వం కలిసి పనిచేస్తే రాజ్యాంగం సజీవం గా ఉంటుంది. ఈ నిర్మాణం మన కాలానికే కాదు, భవిష్యత్ తరాలకు కూడా. తెలంగాణ ప్రజలు మెరుగైన న్యాయ సదుపాయాలను ఆశించే హక్కు కలిగి ఉన్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తయితే, భవిష్యత్ తరాలు మన కృషిని గుర్తిస్తాయి.

# తృణమూల్ పాపాల చిట్టా విప్పుతాం

### మే 4 తర్వాత లెక్కలన్నీ తేలుస్తాం: మోదీ

**కూచ్ బెహార్/కోల్‌కతా, ఏప్రిల్ 5:**




పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఆటలు ఇక సాగవని, ఆ పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందని ప్రధాని మోదీ అన్నారు. మే 4న వెలువడే ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ చేసిన ప్రతి పాపానికి లెక్క తేలుస్తామని హెచ్చరించారు. కూచ్ బెహార్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ఆయన టీఎంసీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా సభకు తరలివచ్చిన అశేష జనాన్ని చూసి ముగ్ధులైన ప్రధాని, "మీ ఉత్సాహం చూస్తుంటే టీఎంసీ పని అయిపోయిందని అర్థమవుతోంది" అని అన్నారు. ఈ ఎన్నికలతో బెంగాల్ నుంచి భయాన్ని తరిమికొట్టి, బీజేపీ విజయంతో ప్రజల్లో కొత్త విశ్వాసాన్ని నింపుతామని హామీ ఇచ్చారు. "ఎన్నికల రోజున టీఎంసీ గూండాలు మిమ్మల్ని ఎంత భయపెట్టినా భయపడకండి.. మే 4 తర్వాత ఎంతటి పెద్ద గూండా అయినా సరే, చట్టం తన పని తాను చేస్తుంది. న్యాయం కచ్చితంగా జరుగుతుంది" అని భరోసా ఇచ్చారు. ఒకవైపు టీఎంసీ అవినీతి, చొరబాటుదారుల భయం ఉంటే, మరో వైపు అభివృద్ధిని పరుగులు పెట్టించే బీజేపీ నమ్మకం ఉందని మోదీ పేర్కొన్నారు. మాల్దాలో న్యాయాధికారులను గంటల తరబడి ముట్టడించిన ఘటనను ప్రధాని తీవ్రంగా ఖండించారు. దీన్ని టీఎంసీ ప్రభుత్వ "మహా జంగిల్ రాజ్"గా అభివర్ణించారు. "రాష్ట్రంలో న్యాయమూర్తులకే రక్షణ లేనప్పుడు, సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి? మమతా బెనర్జీ ప్రభుత్వం శాంతిభద్రతలకు అంత్యక్రియలు నిర్వహిస్తోంది" అని మోదీ విమర్శించారు. రాజ్యాంగ సంస్థలను టీఎంసీ గౌరవించడం లేదని, బెంగాల్ గడ్డపై ప్రజాస్వామ్యం ప్రతిరోజూ రక్తసిక్తమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## దేశంలో వంట గ్యాస్‌కు కొరత లేదు : కేంద్రం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 :**

దేశంలో వంట గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల(ఎఫ్‌టీఎల్ సిలిండర్లు) విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ప్రకటించింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌ను పొందాలంటే సరఫదారుకు నివాస ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. కానీ 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్‌ను సరఫరాదారు నుంచి నేరుగా కొనుగోలు చేయవచ్చు. అయితే, 2026 మార్చి 23 నుంచి ఆదివారం వరకు 6.6 లక్షల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల అమ్మకాలు జరిగాయని కేంద్ర పెట్రోలియం శాఖ ప్రకటించింది. బ్లాక్‌లో సిలిండర్ల విక్రయానికి సంబంధించి మార్చి నుంచి 50వేలకు పైగా సిలిండర్లను సీజ్ చేశామని, 1400 మందికి పైగా ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని వెల్లడించింది. వాణిజ్య సిలిండర్ల సరఫరా కూడా డిమాండ్‌కు అనుగుణంగా క్రమంగా పెరుగుతోందని తెలిపింది. ఏప్రిల్ 6 నుంచి ఎరువుల పరిశ్రమలకు సహజ వాయువు సరఫరాను కూడా పెంచుతామని పేర్కొంది. కాగా, ఇరాన్ యుద్ధం ప్రభావం అమెరికా పౌరులపై పడుతోంది. దేశంలో గ్యాస్, చమురు ధరలు పెరగడంతో.. వివిధ కంపెనీలు సెస్‌లు రూపంలో ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఏప్రిల్ 17 నుంచి కొన్ని డెలివరీలపై 3.5 శాతం ఫ్యూయల్ సర్ చార్జీని వసూలు చేస్తామని ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ప్రకటించింది. రవాణా ఖర్చులు పెరిగిన నేపథ్యంలో బుధవారం నుంచి ప్యాకేజింగ్, డెలివరీలపై 8 శాతం ఫ్యూయల్ సర్‌చార్జి వసూలు చేస్తామని అమెరికా పోస్టల్ సర్వీస్ కూడా ప్రకటించింది.

# జలమే జీవం



**నీటి సంరక్షణపై 100 రోజుల ప్రణాళిక**

**నేటి నుంచి జూలై 14 దాకా కార్యక్రమం**

**సాగునీటి సంఘాలకు బాధ్యతలు**

**ప్రజల భాగస్వామ్యంతో నిర్వహణ**

**టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు దిశానిర్దేశం**

**అమరావతి, ఏప్రిల్ 5**

ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నీటి భద్రతతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని అన్నారు. జల సంరక్షణ ప్రధాన అజెండాగా రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల కార్యక్రమాలను చేపట్టాలని సాగునీటి సంఘాలకు దిశానిర్దేశం చేశారు. దీనిని సోమవారం నుంచి జూలై 14వ తేదీ వరకూ సామాజిక ఉద్యమంలా నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక ప్రకటించారు. ఆదివారం సాగునీటి వినియోగదారుల సంఘాలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60,000 మంది సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. జలవనరులు, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల సమన్వ యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచిం చారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాలకు సీఎం పలు సూచనలు చేశారు. సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ దాకా సాగునీటి భద్రతా కార్యక్రమాలను గుర్తించాలన్నారు. గుర్తించిన పనులకు16 నుంచి 20వ తేదీ వరకు పాలనామోదం పొందాలన్నారు. 21 నుంచి జూలై 9వ తేదీ దాకా పనులు చేపట్టాలని ఆదేశించారు. జూలై 10 నుంచి 14వ తేదీ దాకా పనుల వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ వంద రోజుల కార్యక్రమం అనంతరం వర్షాకాలం ప్రారంభమవుతుందని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో గతంలో కంటే నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, భూగర్భ జలాలు పెరిగాయని వెల్లడించారు. నీటి భద్రత ఇవ్వగలిగితే రాష్ట్రమంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సాగునీటి సంఘాలకు సీఎం చంద్రబాబు సూచించారు. వేసవికి ముందు ఆరు మీటర్ల లోతులో, వర్షాకాలం తర్వాత మూడు మీటర్ల లోతులోనే జలాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను అమలు చేయాలని స్పష్టం చేశారు.

# హోర్ముజ్‌ను తెరవండ్రా..

## తీవ్ర అసహనంతో ట్రంప్ బూతులు

**వెంటనే జలసంధిని తెరవకపోతే నరకంలో జీవించాల్సి వస్తుంది**

**బహ్రెయిన్, సౌదీ, యూఏఈలోని చమురు, ఇంధన వ్యవస్థలపై దాడులు**

**మా మౌలిక సదుపాయాలపై దాడులకు ప్రతీకారంగానే: ఐఆర్‌జీసీ**



**వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 5:**

హోర్ముజ్ జలసంధి మూసివేత తదనంతర పరిణామాలు, ఇరాన్ నుంచి వరుసగా ఎదురుదెబ్బల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంత్రణ కోల్పోయారు. ఒప్పందానికి రావాలంటూ తాను పెట్టిన గడువు ముగుస్తున్నా ఇరాన్ స్పందించకపోవడంతో సహనం కోల్పోయి బూతులు లంకించుకున్నారు. 'ఆ ఫ..గ్ హోర్ముజ్ జలసంధిని తెరవండి.. యూ బా..ర్డ్స్. లేకపోతే నరకంలో జీవించాల్సి వస్తుంది' అని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేస్తూ అసభ్య పదజాలంతో ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఒప్పందం కోసం ఇరాన్‌కు పెట్టిన గడువు సోమవారంతో ముగుస్తుండడంతో మంగళవారం నుంచి విద్యుత్ కేంద్రాలు, వంతెనలపై దాడులు చేస్తామన్నారు. "మంగళవారం ఇరాన్‌లో పవర్ ప్లాంట్ డే, బ్రిడ్జ్ డే.. రెండూ ఒకేసారి జరుగుతాయి. ఎన్నడూ లేనంత స్థాయిలో ఇది ఉంటుంది. వెంటనే జలసంధిని తెరవండి. లేకపోతే నరకంలో జీవించాల్సి వస్తుంది. చూస్తూ ఉండండి. అల్లాకు నా స్తోత్రం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇది యుద్ధంలో ఒక కీలక ఘట్టమని చెప్పారు. టెహ్రాన్‌లో తాము చేసిన భారీ దాడిలో చాలా మంది ఇరాన్ సైనికాధికారులు మరణించారని ప్రకటించారు. ఇరాన్ కూల్చేసిన ఎఫ్-15ఈ విమానం రెండో పైలట్‌ను విజయవంతంగా రెస్క్యూ చేశామని, ఆ కల్నల్ ఇప్పుడు సురక్షితంగా ఉన్నారని ట్రంప్ వెల్లడించారు. తమ సైనికుడి కోసం అమెరికా చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టామని చెప్పారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆయుధాలతో కూడిన పదుల సంఖ్యలో విమానాలు, హెలికాప్టర్లను పంపించామన్నారు. ఒక పైలట్‌ను త్వరగానే గుర్తించి రక్షించామని.. రెండో పైలట్‌కు ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో ఆ వివరాలను ముందుగా ప్రకటించలేదని తెలిపారు. ఇరాన్‌లోని ప్రమాదకర పర్వత ప్రాంతాల్లో రెండో పైలట్ చిక్కుకుపోయారని.. ఆయన లోకేషన్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చామని వివరించారు. గంట గంటకూ పెద్ద సంఖ్యలో శత్రువులు ఆయనకు దగ్గరగా వచ్చారని, ఈ క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి రక్షించామని తెలిపారు. పైలట్ తీవ్రంగా గాయపడ్డారని, అయినా చాలా ధైర్యంగా ఉన్నారని పేర్కొన్నారు.

# ఎవరితోనూ పొత్తులు పెట్టుకోం

**జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 3 మేయర్ స్థానాలను గెలుస్తాం**

**సీఎం.. పాలనపై దృష్టి పెట్టాలి: రాంచందర్‌రావు**

**జనగామ రూరల్/హైదరాబాద్, ఏప్రిల్ 5**

రాష్ట్రంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, ఎవరితోనూ పొత్తు పెట్టుకోదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టం చేశారు. ఆదివారం జనగామ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఎదుర్కొనేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని తేల్చి చెప్పారు. రాబోయే జీహెంఎంసీ ఎన్నికల్లో 3 మేయర్ స్థానాలను బీజేపీ తన ఖాతాలో వేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని, ఆ వైఫల్యాలను సమీక్షించుకుని లోపాలను సవరించుకున్నామని వెల్లడించారు. ప్రపంచ దేశాలన్నీ యుద్ధభయంతో భయపడుతుంటే..దేశ ప్రజలు మాత్రం మోదీ నాయకత్వంలో ప్రశాంతంగా, సురక్షితంగా ఉన్నారని రాంచందర్ రావు అన్నారు. లాక్‌డౌన్ విధించే అవకాశమే లేదని తెలిపారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, రాహుల్ గాంధీకి రూ.1000 కోట్లు ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఆయన ఆరోపించారు. సీఎం మొదటగా ఆరు గ్యారెంటీలను అమలు చేసి, పరిపాలనపై దృష్టి సారించాలని సూచించారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని, అధికారంలోకి వచ్చాక కూల్చివేతలే తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు



సౌకర్యం కల్పిస్తామని చెప్పి, డొక్కు బస్సులను నడపడం వల్ల ఆర్టీసీ వ్యవస్థ కుప్పకూలిందని విమర్శించారు.

# జూరాలపై బ్రిడ్జి కమ్ బరాజ్

**అనువైన స్థలం ఎంపిక చేయండి**

**ఉన్నతస్థాయి సమీక్షలో రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 5**

జూరాల ప్రాజెక్టుకు ఎగువన కృష్ణానదిపై బ్రిడ్జి కమ్ బరాజ్ నిర్మించడానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని ఉన్నతాధికారులను రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. జూరాలకు ఎగువన బ్రిడ్జి కం బారాజ్ నిర్మించాలని ఆదివారం జలసౌధలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అలాగే యుద్ధ ప్రాతిపాదికన జూరాల ప్రాజెక్టుకు మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ప్రాజెక్టులు, చెరువుల్లో పూడికను తొలగించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. జూరాల ప్రాజెక్టులో 1.66 టీఎంసీల నీరు నిల్వ ఉందని, నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల ఊటనీరు వచ్చే అవకాశం ఉందని మంత్రికి అధికారులు వివరించారు. సకాలంలో ఈ నీరు రాకుంటే తాగునీటి అవసరాలకు 0.5 టీఎంసీల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. గత ఏడాది కర్ణాటక నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. చివరి దశలో ఉన్న ఆయకట్టు పంటలకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నుంచి సాగునీరు సరఫరాకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పంటల సాగునీటిని సమర్థంగా వినియోగించే బాధ్యతను ఆయా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు స్వయంగా తీసుకోవాలని సూచించారు.


# నిద్రకు అరోమా థెరపీ



సోషల్ మీడియాలో రోజుకో ట్రెండ్‌ను వైరల్ చేస్తుంటారు. ఫలితాలు ఎలా ఉన్నా.. చాలామంది దాన్ని ఫాలో అవుతుంటారు. ప్రస్తుతం.. 'నిమ్మకాయ-ఉప్పు' కాంబినేషన్‌లో.. ఓ సరికొత్త అరోమా థెరపీ నెట్టింట తెగ ప్రచారంలో ఉన్నది. ఓ నిమ్మపండును కోసి, దానిపై కాస్తంత ఉప్పు చల్లి.. బెడ్ పక్కన పెట్టుకోవడం చాలామందికి రివాజుగా మారింది. ఈ థెరపీ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఇన్‌ఫ్లూయెన్సర్లు చెబుతున్నారు. గాలిలోని బ్యాక్టీరియాను నిమ్మకాయ పీల్చుకుని.. గాలిని శుద్ధి చేస్తుందని చెబుతున్నారు. నిమ్మకాయలోని 'లిమోనిన్' అనే పదార్థం.. మంచి సువాసనను అందిస్తుంది. రాత్రంతా ఈ సిట్రస్ వాసనను పీల్చడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. ఒత్తిడి తగ్గి.. కంటినిండా నిద్ర పట్టే అవకాశం ఉంటుంది. జలుబు, సైనస్ ఉన్నప్పుడు.. ముక్కులు పట్టేస్తాయి. అదే నిమ్మ వాసన పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడం తేలికగా అవుతుంది. అంతేకాకుండా, రాత్రంతా నిమ్మకాయ వాసన పీల్చడం వల్ల బీపీ కూడా తగ్గుతుందట. ఇక నిమ్మకాయ వాసన.. దోమలు, ఈగలు వంటి కీటకాలను దూరం కొడుతుంది. దాంతో దోమల బాధ తప్పుతుంది కూడా!

## ఈ అలవాట్లు మీకు ఉన్నాయా..

**అయితే మీ కిడ్నీల ఆరోగ్యం దెబ్బ తింటుంది జాగ్రత్త..!**



మనం తీసుకునే ఆహారంపైనే మన శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకున్నప్పుడే శరీరంలోని అవయవాలతో సహా మొత్తం శరీరానికి మేలు కలుగుతుంది. అనారోగ్యకరమైన ఆహారం శరీరంలోని అవయవాలకు హానిని కలిగిస్తుంది. మనం తీసుకునే ఆహారం మూత్రపిండాల ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేసి అందులో ఉండే విష పదార్థాలను బటయకు పంపిస్తాయి. మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. మనం తీసుకునే ఆహారాలు కొన్ని మూత్రపిండాలపై ఒత్తిడిని కలిగించడంతో పాటు మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్రపిండాల సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాల ఆరోగ్యానికి హానిని కలిగించే ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**జంక్ ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్..**

జంక్‌ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. వీటిలో ఉప్పుతో పాటు ప్రిజర్వేటివ్స్ ఉంటాయి. ఇవి మూత్రపిండాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ఫ్రెంచ్ ఫ్రైస్, ప్యాక్ చేసిన ఆహారాలు, పిజ్జా వంటివి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే మాంసంలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రోటీన్ మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. మాంసాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాల పనితీరు తగ్గుతుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా తయారవుతుంది. ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారి తీస్తుంది. కనుక మాంసాన్ని కూడా తక్కువగా తీసుకోవాలి. అదే విధంగా చక్కెర పానీయాలు, తీపి ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. తీపి పదార్థాలు రక్తంలో చక్కెరను పెంచుతాయి. రక్తంలో ఎక్కువగా ఉండే చక్కెర స్థాయిలు మూత్రపిండాలకు హానిని కలిగిస్తాయి.

**పండ్లు, కూరగాయలు..**

వీటితో పాటు మనలో చాలా మంది సాసేజ్‌లు, బేకన్, ప్యాక్ చేసిన మాంసం, ప్రాసెస్ చేసిన, డీప్ ఫ్రై ఆహారాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు బీపీ, ఊబకాయం వంటి ఇతర అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇవన్నీకూడా మూత్రపిండాల ఆరోగ్యానికి హానికరం. కనుక ఈ ఆహారాలను తీసుకోవడం చాలా వరకు తగ్గించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారాలకు బదులుగా మూత్రపిండాలకు మేలు చేసే ఆహారాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు వంటి వాటిని తీసుకోవాలి. సమతుల్యమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే ప్రయత్నం చేయాలి. రోజూ 8 నుండి 10 గ్లాసుల నీటిని తాగాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి. రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు అదుపులో ఉండేలా జాగ్రత్త వహించాలి. దీని వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడకుండా ఉంటుంది. మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ విధంగా సరైన ఆహారం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, మూత్రపిండాలకు సంబంధించిన అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

# పుర సమస్యలపై అంకిత భావంతో పని చేయాలి..






**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 05, (మన సమాజం):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో పాలకవర్గం ఏర్పాటు కావడంతో చైర్మెన్, వైస్ చైర్మెన్, కౌన్సిలర్లు అంకిత భావంతో పని చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, విజయగణపతి దేవాలయ అయ్యప్ప స్వాముల బృందం సభ్యులు ఆకాక్షించారు. శనివారం చైర్మెన్ గా ప్రమాణం స్వీకారం చేసిన గోడిసెల సంధ్యారాణి - రాజరమేష్ దంపతులకు అప్పయ్య బృందం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అలాగే సిపిఐ నుండి వైస్ చైర్మెన్ గా ఎన్నికైన మిట్టపల్లి సరిత - శ్రీనివాస్ దంపతులను, సిపిఐ కౌన్సిలర్లను స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని, పుర ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, అయ్యప్ప స్వామి బృందం సభ్యులు, గురు స్వామి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# ప్రజాపాలన రాజకీయ ఎజెండానే

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్...**

**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 05, (మన సమాజం):** రాష్ట్రంలో ప్రజాపాలన రాజకీయ ఎజెండాగానే కొనసాగుతుందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఖానాపూర్ లో చైర్మెన్ వైస్ చైర్మెన్ ఎన్నిక జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే వెద్మ బొజ్జు అధికార అహంకారంతో ఎన్నికల అధికారులను అడ్డుపెట్టుకొని ఎన్నిక వాయిదా పడేలా కుట్రలు చేస్తే ఆదివారం జరిగే ఎన్నిక కోసం తనను, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని హౌస్ అరెస్ట్ చేయడం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మంత్రి వివేక్, ఎమ్మెల్యే బొజ్జు లను గృహనిర్బంధం చేయాలని ఆక్రోశం వ్యక్తంచేశారు. ప్రాణహిత ప్రాజెక్ట్ ఊసే లేకుండా పోయిందని, చెన్నూరు ఎత్తిపోతల పథకం అటకెక్కిందని, ప్రజాపాలన గాడిన పడిందన్నారు. రైతులకు సాగునీరు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టలేని మంత్రి వివేక్ బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, దాడులు చేయడంపై దృష్టి సారించడం సిగ్గు చేటన్నారు. బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లు ఉన్న చోట ఈజీఎస్ నిధులు కేటాయించకుండా ప్రభుత్వ అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ నెల 12 వ తేదీన బిఆర్ఎస్ వర్కింగ్




ప్రెసిడెంట్ కేటీఆర్ మంచిర్యాల జిల్లా పర్యటన ఉండే అవకాశం ఉందని, పార్టీ శ్రేణులు సిద్దంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ గోడిసెల సంధ్యారాణి - రాజారమేష్, పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్, బిఆర్ఎస్ కౌన్సిలర్లు భూమయ్య గౌడ్, కృపానందం, శశికుమార్, రాజశేఖర్, వీణంక శ్రీనివాస్, బబ్బెర స్వర్ణలత, ఆర్నె సంధ్యారాణి, లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

## తాళం చెక్కుచెదరకుండానే

# కానిస్టేబుల్ ఇంట్లో చోరీ...

**మందమర్రిలో హైటెక్ దొంగతనం పై దర్యాప్తు**

**అర్ధరాత్రి దాకా పోలీసుల ముమ్మర విచారణ**



**మందమర్రి ఏప్రిల్ 05,(మన సమాజం) :** మందమర్రి ప్రాణహిత కాలనీ (షిర్కే)లో కానిస్టేబుల్ కుమార్ ఇంట్లో చోటుచేసుకున్న చోరీ కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి సీఐ పర్సా రమేష్, ఎస్ఐ గోపతి నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం ఆదివారం రాత్రి 10 గంటల నుండి సోమవారం తెల్లవారుజామున 2 గంటల వరకు ఘటన స్థలంలోనే ఉండి తీవ్రస్థాయి విచారణ చేపట్టింది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా నిందితుడిని పట్టుకోవాలనే లక్ష్యంతో పోలీసులు కట్టుదిట్టంగా కృషి చేస్తున్నారు.

**"తాళం సేఫ్-సెలెక్టివ్ చోరీపై అనుమానాలు**

సుమారు 8-10 తులాల బంగారం అపహరణలో సెలెక్టెడ్ ఐటమ్స్ మాత్రమే దొంగతనం జరగడం, బయట తాళం చెక్కుచెదరకుండా ఉండగా లోపల బీరువా పగలడం అనుమానాలకు దారితీస్తోంది. డూప్లికేట్ కీ వినియోగమా లేదా ఇతర మార్గంలో ప్రవేశమా అన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న అన్ని టెక్నాలజీలను



వినియోగిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనైనా దొంగను తొందరగా పట్టుకోవాలనే పట్టుదలతో పోలీసులు విచారణ కొనసాగుతుంది.

## ఇకపై గూగుల్ ఏఐ మీకు వచ్చే

# వ్యాధులను ఇలా చెప్పేస్తుంది..!

జన్యు పరిశోధన రంగంలో మరో కీలక అడుగు ముందుకు పడింది. గూగుల్ డీప్‌మైండ్ శాస్త్రవేత్తల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త కృత్రిమ మేథస్సు సాధనం ఆల్ఫా జీనోమ్ ను విడుదల చేసింది. వ్యాధులకు కారణమయ్యే జన్యు మార్పులను గుర్తించడం, కొత్త చికిత్సల అభివృద్ధికి దోహదపడటం ఈ సాధన ప్రధాన లక్ష్యం. ఆల్ఫా జీనోమ్ ఒకేసారి దాదాపు పది లక్షల డీఎన్ఏ అక్షరాలను విశ్లేషించగల సామర్థ్యం కలిగి ఉంది. జన్యు మార్పులు జీన్‌ల పనితీరుపై ఎలా ప్రభావం చూపుతున్నాయి, ఏ కణాల్లో అవి క్రియాశీలకంగా మారుతు న్నాయి, ఎంత స్థాయిలో పని చేస్తున్నాయనే అంశాలను ఇది అంచ నా వేస్తుంది. హృద్రోగాలు, ఆటో ఇమ్యూన్ సమస్యలు, మానసిక ఆరో గ్య రుగ్మతలు, అనేక రకాల క్యాన్సర్లు వంటి సాధారణ వంశపారంపర్య వ్యాధులు ప్రోటీన్ తయారీ జీన్‌ల మార్పుల వల్ల కాకుండా, జీన్‌ల నియంత్రణలో వచ్చే మార్పుల వల్లే ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే ఏ మార్పు అసలు కారణమో గుర్తించడం ఇప్పటివరకు పెద్ద సవాలుగా మారింది.

**మానవ, ఎలుకల జన్యు డేటాతో శిక్షణ..**

ఈ సందర్భంగా డీప్‌మైండ్ పరిశోధకురాలు నటాషా లాటిషేవా మాట్లాడుతూ జీనోమ్ ఎలా పనిచేస్తుందో లోతుగా అర్థం చేసుకోవడానికి, జీవనాన్ని నియంత్రించే జీవ శాస్త్ర కోడ్‌పై పరిశోధనను వేగవంతం చేయడమే మా లక్ష్యం.. అని పేర్కొన్నారు. మనిషి జీనోమ్‌లో దాదాపు మూడు బిలియన్ల డీఎన్ఏ అక్షర జంటలు ఉంటాయి. ఇందులో కేవలం రెండు శాతం మాత్రమే ప్రోటీన్ల తయారీకి నేరుగా ఉపయోగపడతాయి. మిగతా భాగం జీన్‌లు ఎప్పుడు, ఎక్కడ, ఎంత మేరకు పని చేయాలో నియంత్రించే కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజలకు అందుబాటులో ఉన్న మానవ, ఎలుకల జన్యు డేటాతో ఆల్ఫా జీనోమ్‌కు శిక్షణ ఇచ్చారు.

# మేడిపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




**మేడిపల్లి, ఏప్రిల్ 05 :**
మేడిపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వద్ద ఆదివారం రోజు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది వైద్యులు ఆర్థోపెడిక్ జనరల్ సర్జన్ జనరల్ మెడిసిన్ గ్యాస్ట్రో లివర్ చిల్డ్రన్స్ స్పెషలిస్టులు వైద్య సేవలు అందించారు ఈ సందర్భంగా మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు కొండాపూర్ కట్లకుంట మేడిపల్లి నుండి450 మందికి వైద్య సేవలు వినియోగించుకున్నారు . జగిత్యాల నుండి వచ్చిన ప్రముఖ వైద్యులు వీనస్ గ్యాస్ట్రో లివర్ స్పెషలిస్ట్ వైద్యులు సాయి కుమార్ మహావీర్ హాస్పిటల్ నుండి ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ జనరల్ సర్జన్ డా.బీరెల్లి శ్రీనివాస్ జనరల్ మెడిసిన్ వైద్యులు జెల్లా శ్రీకాంత్ . పిల్లల వైద్యులు శ్రీకాంత్ మేడిపల్లి గ్రామపంచాయతీ వద్ద వైద్య సేవలు అందించారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది బిపి షుగర్ టెస్టులు నిర్వహించారు రోగులకు ల్యాబ్ ఉచిత మందుల పంపిణీ చేపట్టారు ఈ కార్యక్రమంలో మేడిపల్లి గ్రామ సర్పంచ్ మకిలి దాస్,ఎస్సై శ్రీధర్ రెడ్డి ,మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి. మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు. మహావీర్ హాస్పిటల్ మేనేజ్మెంట్ కొలగాని అరుణ్ తో పాటు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షుడు మ్యాకలకిషోర్ (జలది న్యూస్) ప్రధాన కార్యదర్శి తిరు కోవెల శ్యాంసుందర్(మన తెలంగాణ) ఉపాధ్యక్షుడు మోత్కుల విజయ్ (ఇంద్రప్రభ) సీనియర్ పాత్రికేయులు గౌరవ అధ్యక్షులు మేన్నేని వేణు (ఈనాడు) ఎండి అఖిల్(ఆంధ్రజ్యోతి) తిరుపతి (ప్రజా దర్బార్) కుందారపు ప్రభాకర్ (6 న్యూస్) మేడిపల్లి గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు

# బాబు జగ్జీవన్ సేవలు చిరస్మరనీయం

**సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావు**





**మెట్‌పల్లి, ఏప్రిల్ 5**
జగిత్యాల జిల్లా. మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలోబాబు జాగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరనీయం అని మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు.

బార్ అసోసియేషన్ మరియు మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి కార్యక్రమం మరియు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జగ్జీవన్ ఫోటోకి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం అనేక చట్టాల్ని రూపొందించారని కొనియాడారు. కార్మికుల పక్షాన కూడా చట్ట సభల వేదికగా పోరాడిన బాబు జగ్జీవన్ ఈనాటి యువతకి ఆదర్శనీయం అన్నారు. ఇట్టి కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి దయ్యా రాజారాం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, సంయుక్త కార్యదర్శి మగ్గిడి నరసయ్య, సాంస్కృతిక కార్యదర్శి కాజీపేట స్రవంతి, కోశాధికారి శంకర్, సీనియర్ న్యాయవాదులు మగ్గిడి వెంకట నరసయ్య, కంతి మోహన్ రెడ్డి, గడ్డం శంకర్ రెడ్డి , రాంపల్లి జగన్ ,జెడి సుధాకర్, తలారి రాజశేఖర్, కోలా అశోక్, బాస రాములు, బత్తుల నవీన్ . పుప్పాల బాను మూర్తి. వజ్జల శ్రీనివాస్. తొగిటి రాజశేఖర్. తదితరులు పాల్గొన్నారు

# జయంతి అనగా పుట్టినరోజు వర్ధంతి అనగా మరణించిన రోజు మరి పునరుత్థానం అనగా ఏమిటి




**కథలాపూర్ ఏప్రిల్ 05**
నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవ సోదరులు ఒక ప్రత్యేకమైన రోజును గొప్ప పండుగల 41 రోజుల ఉపవాస ప్రార్థన రోజులకు ముగింపు పలుకుతూ ఈరోజును యేసుక్రీస్తు ల వారి పునరుత్థానం అనగా మరణించి మూడవదినం తిరిగి లేచిన రోజును ఈస్టర్ పర్వదినంగా ఎంతో దైవ ఆరాధనతో భక్తి కీర్తనలతో బైబిల్ వాక్య పాఠనాలతో జరుపుకున్నారు పండుగను పురస్కరించుకొని కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలో గల జీసస్ గుడ్ న్యూస్ చర్చ్ లో పాస్టర్ గసికంటి సామ్యూల్ గారు దైవ వాక్యాన్ని బోధిస్తూ ప్రపంచంలో మానవులకు జనన దినం మరియు మరణ దినం అన్నది సహజం కానీ ఇక్కడ ఎవ్వరికీ లేని ప్రత్యేకమైన రోజు మరణించి తిరిగి లేచిన రోజు అది కేవలం ఏసుక్రీస్తుల వారికి మాత్రమే సాధ్యమైందని జనన మరణములు కేవలం దైవ అదీనమాని తెలిపారు క్రీస్తు పుట్టుకతోనే కాలం రెండుగా విభజింపబడిందని ఆయన మొదటిసారి సమస్త లోక పాపములు మోసుకొని పోవు దేవుని గొర్రె పిల్లగా తండ్రికి ప్రజలకు మధ్యవర్తిగా వచ్చాడని కానీ ఈ రెండవ మారు అంత్య దినములలో ఆయన రాబోతున్నాడని దానికి సూచనలే ఒక రాజ్యం మీదికి మరొక రాజ్యం యుద్ధాలు చేయడం భూకంపాలు కరువులుఅకాల వర్షాలు అలాగే పాపాలు విపరీతంగా పెరగడం ప్రకృతిలో విపరీత మార్పులు రావడం అన్నీ కూడా దేవుని రాకడను సూచిస్తున్నాయని రాబోవు రోజులలో అగ్ని వర్షం భూమిపై కురుస్తుందని ప్రేమలు తగ్గి స్వార్థం పెరుగుతుంది కాబట్టి ప్రజలు పాపాలను తగ్గించుకొని దైవ ఆరాధనలో దైవభయంతో ఉండాలని సూచించారు,అనంతరం పాస్టర్ లెనిన్ అలాగే పిలెమన్ గార్లు బోధిస్తూ ప్రపంచంలోని అన్ని సమాధులు మూయబడి ఉంటాయికానీ కేవలం ఏసుక్రీస్తు వారి సమాధి మాత్రమే తెరవబడి ఉంటుంది అది దైవ కుమారునికి మాత్రమే సాధ్యమని తెలిపారు, అనంతరం ఈస్టర్ పర్వదినన్ని పురస్కరించుకొని స్వీట్స్ పంపిని కార్యక్రమం జరిగింది.

# పదవుల కోసం పార్టీలు మారను

**సోషల్ మీడియాలో దుష్ప్రచారం: ఈటల**

**హైదరాబాద్, మార్చి 5**
పదవుల కోసం తాను పార్టీలు మారే వ్యక్తిని కాదని బీజేపీ ఎంపీ, పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. 'దివంగత నేత వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఏ మంత్రి పదవి కావాలో కోరుకో రాజేంద్రా.. ఇస్తా.. అని పేర్కొంటూ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినా. అదీ నా చిత్తశుద్ధి. కేసీఆర్, నన్ను మెడలు పట్టి బీఆర్ఎస్ నుంచి బర్తరఫ్ చేసి ఐదేళ్లవుతుంది. నా వ్యక్తిత్వ హననానికీ పాల్పడ్డారు. తనకున్న అధికార బలంతో రాత్రికిరాత్రి నా వ్యాపార షెడ్‌లను కూలగొట్టించారు. భూములు లాక్కున్నారు. అలాంటి నాయకుడి పార్టీలోకి తిరిగి వెళతానా?' అని ఈటల ప్రశ్నించారు. ఆదివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని తన నివాసంలో ఈటల మీడియా సమావేశంలో మాట్లాడారు. 'నాతో పాటు రాజగోపాల్‌రెడ్డి, వివేక్, పొంగులేటి, తుమ్మల, జూపల్లి, జితేందర్‌రెడ్డి అంతా కూడా కేసీఆర్ బాధితులే. ఆయన్ను ఓడించేందుకు 2023లో ఒక వేదిక ఏర్పాటు చేసుకోవాలనుకున్నాం.

# అంజన్నను దర్శించుకున్న రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



**మల్యాల, ఏప్రిల్ 05**
జగిత్యాల జిల్లా కొండగట్టు లోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా ఐపీఎస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. ఆలయ పర్యవేక్షకులు సునీల్ శాలువాతో సత్కరించి, లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మాల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్లుల్ల గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**మెట్‌పల్లి, ఏప్రిల్ 5**
జగిత్యాల జిల్లా. మెట్ పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మయం అని సర్పంచ్ గూడూరు తిరుపతి రజని అన్నారు ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119. వ జయంతి కార్యక్రమం లో జగ్జీవన్ ఫోటో కి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ఉపప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ పార్లమెంటు సభ్యులుగా ఉన్నప్పుడు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు కోసం అనేక చట్టాల్ని రూపొందించారని కొనియాడారు కార్మికుల పక్షాన కూడా చట్టసభల వేదికగా పోరాడిన బాబు జగ్జీవన్ ఈనాటి యువతకి ఆదర్శనీయం అని అన్నారు ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజశేఖర్. మాజీ చెరువు చైర్మన్ నూతుల రాజిరెడ్డి . క్యాసహరీష్. నాగిరెడ్డి .ప్రకాష్ .సురేష్ .మారుతి .అంజయ్య .గణపతి .తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ నగర్లో జగ్జివన్ రామ్ వేడుకలు



**కోరుట్ల టౌన్ ఏప్రిల్ 05**
కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా, వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సామాజిక కార్యకర్తలు, యువకులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ నివాసితులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ముందుగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ ఆయన స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన మహానేతగా కొనియాడారు. ముఖ్యంగా పేదలు, దళితుల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే విద్య, ఐక్యత, క్రమశిక్షణ ద్వారా ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించి,దేశభక్తి గీతాలు, ప్రసంగాలతో ఆకట్టుకు న్నారు. మొత్తంగా అంబేద్కర్ నగర్‌లో జరిగిన ఈ జయంతి వేడుకకు మున్సిపల్ కమిషనర్ అన్ని పార్టీల నాయకులు సంగ అభ్యర్థులు,వార్డు ప్రజలు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని ఉత్సాహభరి తంగా,శాంతియుత వాతావరణంలో జరిగి, స్థానికంగా మంచి స్పందనను పొందాయి.

# మాదిగలకు రాజ్యాధికారమే లక్ష్యం

**బర్కత్‌పుర, ఏప్రిల్ 5**
మాదిగ సామాజిక వర్గాన్ని రాజ్యాధికారం దిశగా నడిపించడమే మాదిగ మహాశక్తి సంఘం ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ మహాశక్తి సంఘం జెండా, లోగోను ఆవిష్కరించారు.



# ప్రయోగాత్మక పాత్రలంటే ఇష్టం

‘ఇందులో నేను చేసిన సరస్వతి పాత్ర చాలా డిఫికల్ట్. ఓ యాక్టర్‌కి ఛాలెంజింగ్ రోల్స్ చేయడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. మేకర్స్ కూడా ఆ పాత్రను సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. అందుకే ఎంజాయ్ చేస్తూ నటించా. ఇప్పటివరకూ నేను చేయని జానర్ ఇది. ఇందులో స్టంట్స్ చేశాను. చేజింగులు చేశాను. ఫిజికల్‌గా చాలా కష్టపడ్డా. తెరపై అందరికీ నచ్చుతాననే అనుకుంటున్నా’ అని మృణాళ్ ఠాకూర్ అన్నారు. అడివి శేష్‌కు జోడీగా ఆమె నటించిన పానిండియా యాక్షన్ రొమాంటిక్ థ్రిల్లర్ ‘డెకాయిట్’. షానియల్ డియో దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం మృణాళ్ విలేకరులతో ముచ్చటించింది. ‘ఒక నటిగా ప్రయోగాత్మక పాత్రల్లో నటించడమంటే నాకిష్టం. అలాగే నాకు నేనే సర్‌ప్రైజ్ అవ్వడం ఇష్టం. అలాంటి అవకాశం ఈ పాత్ర ద్వారా వచ్చింది. ఈ కథ విన్నప్పుడు హరి(అడివి శేష్), సరస్వతి(మృణాళ్) ఎందుకు డెకాయిట్స్‌గా మారారు? అనేది చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఒక డిఫరెంట్ లవ్‌స్టోరీ ఇది. ముఖ్యంగా అడివి శేష్ కోసం అంతా థియేటర్లకు వచ్చి ఈ సినిమా చూడాలని కోరుతున్నా. ఆయన బహుముఖ ప్రజ్ఞశాలి. అద్భుతంగా నటించారు. అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. తెలుగుతోపాటు హిందీలోనూ ఈ సినిమాను షూట్ చేశాం. ఏ భాషవారికైనా నచ్చే సినిమా ఇది. ప్రకాశ్‌రాజ్, అనురాగ్ కశ్యప్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. ఇక దర్శకుడు షానియల్ దగ్గర్నుంచీ సాంకేతికంగా అందరూ అద్భుతంగా పనిచేశారు. కచ్చితంగా ‘డెకాయిట్’ అందరికీ నచ్చుతాడు’ అన్నారు మృణాళ్‌ఠాకూర్.



# అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!


‘మనస్సినక్కరే’ (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా ‘చంద్రముఖి’ ‘గజిని’ చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. ‘నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు’ అని నయనతార పేర్కొంది.

# అనధికార కంటెంట్‌పై ఫిర్యాదు చేస్తాం



భారీ పానిండియా చిత్రాలు నిర్మాణంలో ఉన్నప్పుడు హీరోల గెటప్‌ని గోప్యంగా ఉంచడం సహజం. సమయం చూసుకొని మేకర్సే ఆ లుక్‌ని విడుదల చేస్తుంటారు. ఇదంతా ప్రమోషనల్ స్ట్రాటజీ. కానీ మేకర్స్ విడుదల చేయకముందే లొకేషన్‌లో దొంగతనంగా ఫొటోలు తీసి, వాటిని ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేయడం నిజంగా నేరమే. ‘ఫౌజీ’ సినిమా సెట్ నుంచి ప్రభాస్ ఫొటోలను ఇలాగే కొందరు తుంటరులు లీక్ చేశారు. అవి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం కీలక ప్రకటన విడుదల చేసింది. ‘మా సెట్ నుంచి లీకైన కొన్ని ఫొటోలను ఆన్‌లైన్ వేదికగా సర్క్యులేట్ చేస్తున్నారన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఓ వెండితెర అద్భుతాన్ని మీకందించేందుకు మేం అహరహం కృషి చేస్తున్నాం. మీ ఎదురు చూపులకు తగిన ఫలితాన్నిస్తాం. కానీ ఈ విధమైన చర్యలు మా పనిపై ప్రభావం చూపిస్తాయి. ఇలాంటి పనులకు తెగబడుతున్నవారికి ఇదే మా హెచ్చరిక. ఈ అనధికార కంటెంట్‌పై ఫిర్యాదు చేస్తాం. తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటాం’ అని ‘ఫౌజీ’ చిత్రబృందం హెచ్చరించింది. 1940ల నేపథ్యంలో సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో ఇమాన్వి కథానాయిక. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రధారులు. విశాల్ చంద్రశేఖర్ సంగీత దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది.

# నిద్రపోతే అతను దగ్గరవుతాడు



‘చౌర్యపాఠం’ఫేం ఇంద్రరామ్ హీరోగా మమ్ముట్టి ‘స్ట్రీట్ లైట్స్’ చిత్ర దర్శకుడైన సినిమాటోగ్రాఫర్ షామ్‌దత్ దర్శకత్వంలో ఓ యూనిక్ సైకలాజికల్ థ్రిల్లర్ రానుంది. ఈ చిత్రం నేరుగా తెలుగులో నిర్మితమవుతుండటం విశేషం. వి డ్రీమ్స్ ఫిల్మ్స్ పతాకంపై వి.చూడామణి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ‘డోంట్ స్లీప్’ అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఆదివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. తమిళ అగ్రనటుడు విజయ్ సేతుపతి టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్లను ఆవిష్కరించి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. మలయాళ చిత్రాల డెప్త్, తెలుగు సినిమాల భారీతనం కలగలుపుగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. త్వరలో విడుదలకానున్న ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు: సజీర్ బాబా, లూనా జబిన్, సంగీతం: గోకుల్ హర్షన్.

# ఆ చాన్స్ వస్తే బాగుంటది!

‘సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే’ అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం ‘తెలుసుకదా’ ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. ‘ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి’ అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ ‘నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా.

